క్లుప్తంగా

భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా గోపీచంద్


బాధ్యతలు స్వీకరించిన గోపీచంద్

భీమునిపట్నం: భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా ఎం.గోపీచంద్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ తులసీదాస్ పద్మనాభం మండలంలోని ఇనాం భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ఆయన్ను అధికారులు సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో విశాఖలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్కెట్ విలువ మరియు ఆడిట్ విభాగానికి చెందిన అధికారి గోపీచంద్ నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలను కచ్చితంగా పాటించి రిజిస్ట్రేషన్లు చేస్తానని తెలిపారు.

బోనంగి పండు పడాల్‌కు నివాళి


పడాల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఈడీ రాణి, సిబ్బంది

కొమ్మాది: బీచ్‌రోడ్డు రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ భవన్‌లో ఆదివాసి ఉద్యమ నేత బోనంగి పండు పడాల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి శిక్షణ భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మంధా రాణి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ నిరంకుశ పాలనలో గిరిజనులను దయనీయ స్థితి నుంచి బయటికి తీసుకువచ్చేందుకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుతో కలిసి అనేక పోరాటాల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

అవయవదానంతో చిరంజీవులవుదాం

తగరపువలస: అవయవదానం చేయడం ద్వారా ప్రతి మనిషి చిరంజీవిగా జీవించాలని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఒక మనిషి చనిపోయిన తరువాత తన అవయవాలు వృథాగా మట్టిలో కలిసేకంటే దానం చేయడం ద్వారా పలువురికి జీవితాలు ప్రసాదించడమే కాకుండా, తాను కూడా వారి ద్వారా పునర్జన్మ పొందవచ్చన్నారు. అలాగే ప్రపంచ ఎడమచేతి వాటం ప్రజల దినోత్సవం గురించి వివరించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు త్రివర్ణ పతాకాలతో సెల్ఫీ తీసుకునేలా ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి

పద్మనాభం: వరి పంట సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి సూచించారు. వరి పంటలో సాగు మెలకువల గురించి కోరాడలో రైతులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. అప్పలస్వామి మాట్లాడుతూ వరి పంటలో రైతులు ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీ మీటర్లు చొప్పున కాలి బాటలు తీసుకోవాలన్నారు. కాలి బాటల వల్ల ఎరువులు, పురుగుల మందులను సులభంగా వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సి.హెచ్.సుబ్రమణ్యం, ఏవో సురేష్, కోరాడ మాజీ ఎంపీటీసీ కొండ్రోతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత న్యాయ సేవలు

- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ
- కేజీబీవీ, భవిత కేంద్రాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు



కస్తూర్బా విద్యాలయంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ


మధురవాడ భవిత కేంద్రంలో దివ్యాంగ బాలురతో సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

పద్మనాభం: మహిళలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. మండలంలోని కృష్ణాపురంలోని కస్తూర్బా విద్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు నిండి, ఏడాదికి రూ.3లక్షల లోపు ఆదాయమున్న పురుషులకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు. బాగా చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు సూచించారు. కేజీబీవీలో కిచెన్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థినులు ప్రదర్శించిన జలదీప్ విన్యాసాన్ని తిలకించారు.

భవిత కేంద్రం సందర్శన

పద్మనాభం భవిత కేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ సందర్శించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న విద్యాపరమైన అవకాశాలు, కల్పిస్తున్న మౌలిక వసతుల గురించి వివరించారు. కార్యక్రమాల్లో ఎంఈవో ఎస్‌డీ బాబూలాల్, సమగ్ర శిక్షా అభియాన్ సహిత విద్య కో–ఆర్డినేటర్ బి.గీత, కస్తూర్బా విద్యాలయ ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, భవిత కేంద్రం రిసోర్సు పర్సన్లు రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఎం.ప్రశాంతి పాల్గొన్నారు.

మధురవాడ భవిత కేంద్రంలో..

మధురవాడ: మధురవాడ భవిత కేంద్రాన్ని సీనియర్ సివిల్‌జడ్జి ఎం.వెంకట శేషమ్మ సందర్శించారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విచ్చేసిన జడ్జికి విద్యార్థులు పుష్పగుచ్ఛం అందించి, స్వాగతించారు. ఆమె పిల్లలను, వారి తల్లిదండ్రులను ఆత్మీయంగా పలకరించారు. విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఎంఈవో పి.అనురాధ, సహిత విద్య కో–ఆర్డినేటర్ బి.గీత, ఏపీవో అప్పలనాయుడు, ఆర్పీలు ఎస్‌కే సలీమ సాహిజీ, ఎస్.మహాలక్ష్మి, సీఆర్‌పీ రాంబాబు పాల్గొన్నారు.

దబ్బందలో..

తగరపువలస: ఆనందపురం మండలం దబ్బందలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ పాల్గొన్నారు. గ్రామస్తులకు న్యాయ వ్యవస్థ, హక్కులపై అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థులు, గిరిజనులకు చట్టాలు కల్పిస్తున్న రక్షణ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఆనందపురం పీహెచ్‌సీ ద్వారా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలందించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సుబ్రహ్మణ్యం, ఆనందపురం తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఎస్‌ఐ సంతోష్, సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నివాసాల మధ్య సెల్ టవర్‌పై ఆందోళనకు సిద్ధం

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు వెంకటేశ్వరమెట్టను ఆనుకుని ఎల్లారమ్మమెట్ట మార్గంలో శ్మశానం ముందు తలపెట్టిన సెల్‌టవర్ నిర్మాణం వద్దని స్థానికులు కోరుతున్నారు. టవర్ నిర్మాణం చేపడుతున్న ప్రదేశాన్ని ఆనుకుని పశువుల డెయిరీ, చుట్టుపక్కల బాలాజీనగర్, వెంకటేశ్వరమెట్ట ప్రజలు నివాసం ఉన్నందున దీనినుంచి వెలువడే రేడియేషన్ కారణంగా పశువులు, మనుష్యులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆందోళన చెందుతున్నారు. ఎయిర్‌టెల్ సంస్థకు స్థలాన్ని ఇచ్చిన యజమానులు వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. దీనిపై స్థానికులు ఆందోళనకు సిద్ధం కావడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడానికి సమాయత్తం అవుతున్నారు.

రాస పోలమాంబకు ప్రత్యేక అలంకరణ


ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస: మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. ముద్దగ, పసుపు చామంతి, ఎరుపు చామంతి పూలతో అలంకరణకు స్థానిక ఎస్‌ఆర్‌పీఎం యూత్ ఆర్థిక సహకారం అందించింది. ఆలయం వద్ద భక్తులకు తుపాకుల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లి ఆలయంలో భక్తులకు దాతలు తమ్మిన శ్రీను, గాదం మహేష్ సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

సేవా నగర్ కాలనీలో స్వచ్ఛభారత్

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది పరిధి సేవానగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో సేవానగర్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న తుప్పలను, వ్యర్థాలను సభ్యులు తొలగించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఆకుల జోజిబాబు, సొండి రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల ప్రమాదాలు పునరావృతం కారాదు


మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: తమ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పిల్లలను బస్సుల్లో సురక్షితంగా ఇంటికి చేర్చే బాధ్యతను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చేపట్టాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎంఈవో ఎస్‌డీ బాబూలాల్‌తో కలిసి ప్రైవేటు పాఠశాలల బస్సుల ప్రమాదాలపై మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలను బస్సుల్లో ఇంటికి చేర్చేటప్పుడు తప్పనిసరిగా బస్సులో క్లీనర్లు ఉండాలన్నారు. ఇటీవల ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొనడంతో మూడేళ్ల చిన్నారి మృతి చెందడం విచారకరమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించాలని ఎంఈవోకు సూచించారు.

క్రీస్తు బోధనలు వ్యాప్తి చేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ పాల్ విక్టర్

మధురవాడ: క్రీస్తు బోధనలు మరింత వ్యాప్తి చేసేందుకు క్రైస్తవ మత పెద్దలంతా మరింత ఐకమత్యంగా పనిచేయాలని రెవరెండ్ డాక్టర్ గరికిముక్కల పాల్ విక్టర్ అన్నారు. కొమ్మాది జంక్షన్ వద్ద గల బేతేల్ చర్చిలో విశాఖ క్రైస్తవ నాయకుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 5, 6, 7 వార్డుల్లో గల ప్రార్థనా మందిరాలకు చెందిన మత పెద్దలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో క్రైస్తవ సంఘ కాపరులు సువార్త సభను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. గంభీరం టోల్‌ప్లాజా సమీపంలోని దుక్కవానిపాలెం వద్ద సెప్టెంబర్ 21, 22 తేదీల్లో నిర్వహించే సభను జయప్రదం చేయాలన్నారు. బిషప్ మామిడి మోహనరావు, అభిషక్తిరాజు, బిషప్ మింది జెస్సి రత్నకుమార్ దైవ సందేశం ఇచ్చారు.

గ్రామదేవతలకు మొక్కుల చెల్లింపు


బంగారమ్మ ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తగరపువలస: ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం గ్రామదేవత బంగారమ్మకు స్థానికులు మంగళవారం మొక్కులు చెల్లించారు. అమ్మవారికి వారాల సందర్భంగా బంటుపల్లి వారి కళ్లాలు, దొంతలవారి కళ్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. నేలవేషాలు, బాణసంచా, తీన్‌మార్ కార్యక్రమాల హోరులో ఆలయం వరకు సందడి చేశారు.

శింగనబందలో పైడితల్లమ్మకు.. : శింగనబంద గ్రామదేవత పైడితల్లమ్మ వారాల సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

కాలువను కప్పేశారు


తాటితూరు సర్వే నం.86లో హార్మోణి వెంచర్ ప్రతినిధులు కప్పేసిన పోరంబోకు కాలువ

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు, తాళ్లవలస పంచాయతీలలో విస్తరించిన హార్మోణి వెంచర్ యాజమాన్యం యంత్రాలతో పోరంబోకు కాలువను కప్పేసిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. దీనిపై తాళ్లవలస పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన బాధిత అక్కా తమ్ముళ్లు రవ్వ సుభద్ర, బోని అప్పలనూరిబాబు తెలిపిన వివరాలివి.. తమ తండ్రి బంగారప్పుడు తాళ్లవలస తలయారీగా పనిచేసే సమయంలో 1974లో సర్వే నంబర్ 4/1లో 25 సెంట్లు, 1991లో 45 సెంట్లు, అదే సర్వే నంబర్‌లో ఎస్ఎఫ్ఏ నమోదు కాబడిన డీ పట్టా భూములు మంజూరు అయ్యాయని తెలిపారు. అప్పటి నుంచి బంగారప్పుడు, అతని అనంతరం వారసులు ఆ స్థలాల్లో వరి పంట సాగు చేసుకుంటున్నామని, ప్రస్తుతం ఈ భూమి 22ఏ రికార్డులో నమోదై ఉందని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూములకు సంపూర్ణ భూహక్కు చట్టం కింద ఫ్రీహోల్డ్ హక్కులు కల్పిస్తూ కలెక్టర్ ద్వారా పట్టా కూడా మంజూరు చేసినట్లు తెలియజేశారు. ప్రస్తుతం వీరి భూమిని ఆనుకుని ఉత్తరం వైపు పోరంబోకు కాలువ, దాని తరువాత హార్మోణి వెంచర్, అలాగే దక్షిణ భాగాన కూడా వీరికి వెంచర్ ఉండటంతో, ఈ రెండు వెంచర్లను కలిపేందుకు యాజమాన్యం కాలువను కప్పి వంతెన నిర్మాణానికి పూనుకుందని బాధితులు ఆరోపిస్తున్నారు. తాటితూరు పెద్ద చెరువు నుంచి పెద్దిపాలెం పంచాయతీ మీదుగా వచ్చే కాలువ తగరపువలస గోస్తని నదిలో కలుస్తుంది. కాలువను కప్పివేయడం వలన తమ పొలంతో పాటు ఇరువైపులా ఉన్న రైతుల పొలాలకు నీరు అందకుండా పోతుందని బాధితులు తెలిపారు. పోరంబోకు కాలువను కప్పుతున్న విషయాన్ని భీమిలి ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా బుధవారం పరిశీలిస్తామన్నారని చెప్పారు. ఈ మేరకు బాధితులు భీమిలి ఆర్డీవో, తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాండ్రంగిలో పొలంబడి

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో మంగళవారం మండల వ్యవసాయ శాఖాధికారి ఎంవీఎస్ చలం పొలంబడి నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, కలుపు నివారణలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, పురుగుల మందుల వాడకం గురించి అవగాహన కల్పించారు. ఎకరాకు రెండు బండ్ల పశువుల గెత్తం వేయాలని రైతులకు సూచించారు. విత్తన శుద్ధి చేసే సుడోమోనోస్ మందును 50 శాతం రాయితీపై పొలం బడి రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఈవో రమ పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ తిరిగి ఇంటికి..

భీమునిపట్నం: కొడుకుతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ మంగళవారం సాయంత్రం తిరిగి వచ్చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలివి.. నేరెళ్లవలస కాలనీకి చెందిన నక్కాన పార్వతి కొడుకు శివాజీ, కోడలు ప్రియాంకతో కలిసి ఉంటున్నారు. విద్యుత్ లైన్‌మన్‌గా పని చేస్తున్న కొడుకుకు, తల్లికి నిత్యం గొడవలు జరగడంతో, మూడు రోజుల క్రితం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై కొడుకు, కోడలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఆమె పిఠాపురంలో తెలిసిన వారి ఆశ్రమంలో ఉండటానికి వెళ్లారు. అయితే, ఆమె అదృశ్యమైన వార్త పత్రికల్లో రావడంతో విషయం తెలిసిన ఆమె ఇక్కడ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. కొడుకు సరిగ్గా చూడకపోవడంతో ఇక్కడ ఉండటం ఇష్టంలేక వెళ్లిపోయానని తెలిపారు. దీనిపై స్పందించిన పోలీసులు ఆమె కోడలు ప్రియాంకను పిలిచి, అత్త పార్వతిని బాగా చూసుకోవాలని చెప్పి అప్పగించారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

మధురవాడ: మారికవలస విద్యుత్ సబ్ స్టేషన్ 11కేవీ పరదేశిపాలెం, జేకే లే అవుట్ ఫీడర్ల పరిధిలో నిర్వహణ, మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా పరదేశిపాలెం ఈడబ్ల్యూఎస్ కాలనీ, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం, కాపులుప్పాడ డంపింగ్ యార్డు, చిలుకూరి లే అవుట్, జేకే లే అవుట్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

సభ్యుల వివరాలను కంప్యూటరీకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో లక్ష్మీపతి

భీమునిపట్నం: భీమిలి డివిజన్ పరిధిలోని వ్యవసాయ సహకార సంఘాలకు సంబంధించిన సభ్యుల వివరాలను కంప్యూటరీకరించాలని డీఎల్‌డీవో బి.లక్ష్మీపతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సచివాలయాల వెల్ఫేర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంతవరకు సభ్యులు తీసుకున్న రుణాలకు సంబంధించిన వివరాలు మాత్రమే ఉన్నాయని, ఇప్పుడు ప్రతీ సభ్యుడికి సంబంధించిన పేర్లు, వివరాలు, ఆధార్, మొబైల్ నంబర్లతో అనుసంధానం చేయాలని ఆదేశించారు. దీంతోపాటు అన్ని వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కో–ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ రేఖ జ్యోతిర్మయి, డీసీసీబీ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ అప్పలరాజు, ఎంపీడీవో జానకి పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు


పద్మనాభం నుంచి బయల్దేరి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పద్మనాభం: ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు పద్మనాభం మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు 60 మంది మంగళవారం విజయవాడ తరలివెళ్లారు. పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి వీరు ఒక బస్సుతో పాటు కారుల్లో బయల్దేరి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

ఉత్సాహంగా 'హర్ ఘర్ తిరంగా'

150 అడుగుల జెండాతో విద్యార్థుల ర్యాలీ


బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, విశాఖకు చెందిన స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పెద్దబజారు, మెయిన్‌రోడ్డు, చిన్నబజారు ప్రాంతాల్లో 150 అడుగుల జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొన్నగంటి రమణ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి మన దేశం గొప్పదనాన్ని, స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేసిన మహానుభావుల గురించి విధిగా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు శివారాణి, జయప్రద, వివేకానంద సేవ సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు ఎం.లక్ష్మణరావు, కాళ్ల సన్నీ, కె.ముత్యాలరావు, ఎం.షణ్ముఖరావు పాల్గొన్నారు.

- నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి పుట్టా గంగయ్య, నాయకులు కంటుభుక్త సునీత, అనిల్ కుమార్, పి.శ్రీనివాసరావు, పోతిన పైడిరాజు పాల్గొన్నారు.

పందిరిగా జాతీయజెండా

ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం నిర్వాకం


పాఠశాల ఆవరణలో పందిరిగా వేసిన జాతీయ జెండా

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ జంక్షన్ వినాయకుడి గుడి వెనుక ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల వద్ద జాతీయ జెండాకు తీవ్ర అవమానం జరిగింది. ఇక్కడ జాతీయ జెండాను పాఠశాల ఆవరణలో పందిరిగా వేయడాన్ని పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. జాతీయ జెండా విశిష్టతను తెలియజేయాల్సిన పాఠశాల యాజమాన్యం ఈ విధంగా తప్పుదోవ పడితే విద్యార్థులకు ఏమి నేర్పిస్తారని ప్రశ్నిస్తున్నారు. పాఠశాల యాజమాన్యంపై పోలీసులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్లు కోరుతున్నారు.

నో పార్కింగ్ బోర్డుల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..


కొమ్మాది జంక్షన్ వద్ద బోర్డు ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మధురవాడ: పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు నో పార్కింగ్ జోన్లు గుర్తించి, బోర్డులు ఏర్పాటు చేశారు. మధురవాడలో నిత్యం పెరిగిపోతున్న ట్రాఫిక్‌తో సిగ్నల్స్, ప్రధాన జంక్షన్ల వద్ద ప్రజలు, వాహన చోదకులు గంటల పాటు పడుతున్న ఇబ్బందుల గురించి సాక్షి దినపత్రికలో ఇటీవల 'ట్రాఫిక్ పద్మవ్యూహం' శీర్షికన ప్రచురితమైన కథనంపై పోలీస్ అధికారులు స్పందించారు. సీఐ కాంతారావు ఆధ్వర్యంలో కార్‌షెడ్, పీఎం పాలెం, మిథిలాపురి వుడా కాలనీ, డీ మార్ట్, జీవీఎంసీ ఆఫీస్, స్టేట్ బ్యాంక్, కొమ్మాది జంక్షన్ పరిసర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో నో పార్కింగ్ జోన్లను గుర్తించి, బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయా ప్రదేశాల్లో వాహనాలు పార్క్ చేస్తే రూ.1035 పెనాల్టీ విధిస్తామని తెలిపారు.